# అరణ్య జీవితం



కళ్ళు రెండూ మిలమిల మెరుస్తుండేవి. అటూ ఇటూ బుల్లితోక, అది పరవశంతో నటనమాడుతున్నదా అనిపించేది.

మధురమైన దాని రాగాలాపన, అడవి నలుమూలల్నీ గిలిగింతల్తో మేల్కొల్పి, ఆతర్వాత అడవిపక్షుల బృందగానంలో లీనమయ్యేది.

అంతవరకూ గూటిలోని పెంటి పోకచెక్కలకంటే చిన్నవైన బూడిదరంగు గ్రుడ్లకు వెచ్చదనాన్ని కల్పించడంలో మునిగివుండేది.

అపుడపుడూ వడ్రంగి పిట్టొకటి వచ్చి చెట్టు బెరడును పరీక్షించి వెళ్ళేది. ఒక్కోసారి అడవి పావురాయో, గ్రద్దో చెట్టుపైన వ్రాలి కొద్దిసేపు సేదదీర్చుకునేది. కాని రెమ్మల్లో రెమ్మగా ఆకులమాటున ఒదిగివున్న ఆ చిన్ని పిట్టల గూడు వాటికంట పడేదికాదు. ఇతర ప్రపంచంనుండి తమకు నీడను కల్పించిన ఆ మ్రానులో పాలపిట్టల జంట హాయిని, భద్రతను పొందగల్గామని తలచాయి....

అయితే, జూన్ మాసంలో ఓ సాయంకాలం....

చీకటి మందమందంగా అలుముకోసాగింది.

పాలిపోయిన చుక్కలు తమ దూరపు నెలవులనుంచి మిణుకు మిణుకు మంటున్నాయి....

అడవిపూలు తమ సువాసనల్తో గాలిని నింపాయి....

అడవి సద్దుమణగింది.

కన్ను పొడుచుకున్నా కనిపించని చీకటి....

రెమ్మ రెపరెపమన్నా వినిపించే ప్రశాంతి....

నన్నటి నీడొకటి దొంగలా ఆ మ్రానును యెగబ్రాక సాగింది.... పాదాలకు మెత్తలుండటం వలన దాని కదలిక ఎటువంటి చడీచప్పుడు కల్గించడంలేదు....

ఆ నీడ ముక్కుపుటా లారుస్తున్నది; ఏదో వాసన పసిగట్టి ఆ జాలుగా పైకి ప్రాకుతున్నది.

దాని ఒంటి నిగనిగల మెరుగులో ఆకాశంలోని చిన్ని దివ్వెలు తళతళమన్నాయి. ఆ నీడ, చెట్టు బోదె పైన జాడ తెలుసుకోలేని ముద్రలు వేస్తూ - పైకి ఎగబ్రాకి తొర్రను సమీపించింది....

తొర్రలో దానికి కావలసింది కనిపించలేదు. తలెత్తి వాసన జాలు కోసం ముక్కుపుటా లారుస్తూ తల అటు ఇటూ ఊగించింది. అనంతరం అది పైనెక్కడోవున్న కొమ్మల వైపుగా కదిలి ముందుకు సాగింది.

నిద్రలోవున్న పెంటి, పీడకల గన్నట్లు అదిరిపడి మేల్కొంది.

ఏదో మదపువాసన....

గూటిలోనుంచి తలెత్తి, వాసన వస్తున్న దిక్కుగాచూచింది పెంటి..

దాపునేవున్న చిగురు కొమ్మన, నిప్పురవ్వల్లాంటి రెండు చుక్కలు కనిపించాయి.

పెంటి వ్రమాదాన్ని పసిగట్టింది కాని కదలలేదు. పోతుపిట్టను పిలవాలన్న ఆలోచన కల్గలేదు. ఓ వేళ ఆ ఆలోచన కలిగినా, పోతుపిట్టను పిలవటంవలన జరిగే మేలుకంటే కీడే యెక్కువని అది తలచివుండవచ్చు.

మరి ....

అపాయం సమీపిస్తున్నది ....

కన్నప్రేమ, తల్లిప్రేమ అన్నారు బిడ్డలను కడుపుకు పొదుముకున్నట్లు ఆ పెంటి తనకూనలపై పరచిన రెక్కలను మరింతగాచాచి, వాటిని గట్టిగా గుండెకు హత్తుకుంది.

పసికూనల వాసన జాడనవచ్చిన 'ఎంట్రె' సద్దుచేయకుండా గూటిని సమీపించింది. తన పంజాలమధ్య కూటిని ఇరికించుకొని క్రిందకు వేగంగా దుమికింది ....

పెంటి తొణకలేదు; బెణకలేదు. కూనల్ని రెక్కల్లో ఇముడ్చుకొని గూటిలో బిగదీసుకుపోయింది: తనను తనకూనలనుండి ఎవరూ విడదీయలేరన్నట్లు ....

కోరల్లా వాడీగావున్న ఎంట్రెపళ్లు సుతిమెత్తటి పెంటిపిట్ట మెడలోకి దిగాయి. ఊపిరాడక కొట్టుకుంటున్నట్లు గురగురమనేరొద కొద్దిక్షణాలు జీరాడి పెంటి చావును పలికింది.

ఎంౖబె తీరిగ్గా, నిర్భయంగా, పెంటిని, రెక్కలురాని దానికీ నల్లి మెక్కసాగింది.

ఎగువ కొమ్మల పైన కునుకుతున్న పోతుపిట్ట ఎన్నడూ యెరుగని నవ్వడికి మేల్కొంది.

చీకటి వికృతంగా అలుముకుని వుంది; అస్పష్టంగా గూడా ఏమీ కనిపించటంలేదు ....

పోతుపిట్టకు ఎందుకో అనుమానం కల్గి సున్నితంగా సుకుమారంగా పిలచింది ....

జవాబులేదు ....

పోతుపిట్ట చాలా సేపు చెవి వొగ్గి వింది ....

ఉహూఁ, అంతా ప్రశాంతంగా వుంది ....

పెంటిని మళ్ళీ పిలవాలనుకుంది; ప్రేమతో గోముగా పలుకరించాలనుకుంది. కాని కూనలకు వెచ్చదనాన్నిస్తూ అవి కలిగించే నులివెచ్చదనంతో పరవశించివున్న పెంటిని మేల్కొల్పటం పాడికాదనుకుంది. పాడి అనుకున్నా కీడు జరుగుతుందేమో అని శంకించింది. అందుకని శంకలుమాని కొమ్మను కాలివ్రేళ్లతో గట్టిగా కరచుకొని కునుకుదీయసాగింది....

ఎంౖబెమెక్కడం పూర్తయింది; సంతృప్తితోబాటు దానికి బడలిక కల్గింది....

ఆ రాత్రికి దాని వేట పూర్తయింది.

దానికిక కావలసింది, పడిన శ్రమకు తగిన విశ్రాంతి....

అందువలన అది వెనుదిరిగి తొఱ్ఱను చేరుకుంది. తొఱ్ఱలో చుట్టలా ముడుచుకు పడుకొని, సన్నగా గుర్రుపెడ్తూ చిక్కటి నిద్రలో కరిగిపోయింది ....

ఆకుల మెత్తటి గలగలలు దూరాన్నున్న సెలయేటిగుసగుసలకు నూరు పల్కుతున్నవా అన్నట్టు వినిపిస్తున్నాయి....

స్వర్గంలోని దివ్వెలు ఇంకా వెలుగుతూనే వున్నాయి....

ఏం జరిగిందో తెలియని అడవి ప్రశాంతంగానే వుంది....

* * *

వేకువ తొలిరేకులు చెదరి అడవి కప్పును వెలిగించాయి....

మగత నిద్రలోవున్న పోతుపిట్టకు మెలుకువ వచ్చింది; ఆత్రంతో గూడు వున్న దిక్కుగా చూచింది.

ఉహూఁ, గూడు కనిపించలేదు.

గుండె దడదడమనగా పోతుపిట్ట చుట్టూ కలయజూసింది....

క్రింద....

వనవృద్ధుని పాదాలచెంత....

గూడు పడివుంది; అటూ ఇటూ

చెదురుగా పడివున్న ఈకలు జరిగిన విషాద సంఘటనను చెప్పకనే చెప్తున్నాయి....

పోతుపిట్ట చాలాసేపు విలపిస్తూనే వుంది. బొంగురుపోయిన దాని గొంతు పోగొట్టుకున్న జతను పిలుస్తూనేవుంది. దాని కంఠంలో వెనుకటి మాధుర్యంలేదు; ఆమాటకొస్తే దాని కంఠంలో జీవమే లేదు....

అడవికి మళ్ళీ ప్రాణం వచ్చింది..

కెంపువన్నెలోవున్న ఉదయ రాగంలో మ్రానులు ఠీవిని ఒలికిస్తూ గర్వాతిశయాన్ని చాటుతున్నాయి.

జీవంపోసుకున్న ప్రకృతిని చూచి పోతుపిట్ట కొద్దిసేపు తనను, తన దుఃఖాన్ని మరచింది. అలవాటు ప్రకారం కొమ్మమీదనుంచి క్రిందకు వాలి అటూ ఇటూ గెంతబోయింది. కాని ప్రక్కన జతలేకపోయేసరికి దాని కాళ్ళు కుంటువడినట్లనిపించాయి.

తాను ఒంటరైపోయినట్లు బాధ పడుతూ పోతుపిట్ట రివ్వున పైకెగిరి, తనకొమ్మను చేరుకుంది; తమగూడు వున్న దిక్కుగా చూసింది ....

గూడులేక బోసికొడుతున్న కొమ్మ, దాని గుండెల్లో గుబులును, దిగులును రేపింది. ప్రపంచమే బోసికొడుతున్నట్లనిపించి – అది చలనంలేకుండా కూర్చుండిపోయింది.

రోజూ తీయటిరాగంతో అది అడవిని మేల్కొల్పేది; కాని రాగాలాపన బదులు దానిగుండె దిగులును ఆలపిస్తున్నది.

అంతలో అడవిలోని ఇతరపక్షుల బృందగానం దాని చెవికిసోకింది.

పోతుపిట్టకు కర్తవ్యం గుర్తుకొచ్చింది ...

రెక్కలు అర్చి, అడవిలోని పక్షులబృందగానానికి శ్రుతికలపటానికి అన్నట్లు గొంతెత్తింది ....

కాని .... ....

కాని....దాని గొంతు పెకలలేదు.

---

మూలం :

**ఆండ్రే సోవినిస్కి.**

స్వేచ్ఛానువాదం :

**శ్రీ రామచంద్.**

---